క్లుప్తంగా

జీవాలకు టీకాలు తప్పనిసరి



గోవులకు టీకాలు వేస్తున్న దృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): పశువులకు సోకే వ్యాధులపై రైతులు జాగ్రత్తగా ఉండాలని మండల పశువైద్యాధికారి సంధ్యారాణి అన్నారు. ఆదివారం మండలంలోని దొంతి గోశాలలో గోవులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పలు గోవులకు లంపీస్కిన్ వ్యాధి సోకినట్లు నిర్వాహకులు అనుమానం వ్యక్తం చేయడంతో గోవులను పరీక్షించి టీకాలు చేశారు. పశుపోషణ, దూడలా సంరక్షణ, సీజనల్ వ్యాధులపై రైతులకు వైద్యాధికారి అవగాహన కల్పించారు. పశువులు అనారోగ్యానికి గురవుతే నాటు వైద్యం చేయకుండా పశు వైద్య సిబ్బందికి సమాచారం అందించి చికిత్స చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గోశాల నిర్వాహకుడు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఘనంగా క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ నర్సింలు

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండలం స్టేషన్ మాసాయిపేట గ్రామంలో స్వశక్తి యువజన సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాల నుంచి 30 జట్లు పాల్గొంటున్న పోటీలను ఆదివారం స్థానిక సర్పంచ్ నర్సింలు ప్రారంభించారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఈ సందర్భంగా సర్పంచ్ నర్సింలు సూచించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు రమేశ్, స్వామి, మహేశ్ పాల్గొన్నారు.

నేడు ఎంపీపీగా బాధ్యతల స్వీకరణ

నర్సాపూర్: నర్సాపూర్ ఎంపీపీగా నర్సింగరావు సోమవారం పదవి బాధ్యతలు తీసుకుంటారని ఎంపీడీఓ మార్టిన్‌లూథర్ తెలిపారు. ఇటీవల ఎంపీపీ జ్యోతిపై జెడ్పీ సీఈఓ శైలేశ్‌కుమార్ అనర్హత వేటు వేసిన విషయం తెలిసిందే. దీంతో మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్న నర్సింగ్‌రావు సోమవారం ఎంపీపీగా బాధ్యతలు తీసుకోనున్నారని చెప్పారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి హాజరవుతున్నారని, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఆయన కోరారు.

ప్రశాంతంగా పరీక్ష



పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు

కొల్చారం(నర్సాపూర్): సాంఘిక సంక్షేమ గురుకుల ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో 2023 – 24 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం ఆదివారం మండల కేంద్రం కొల్చారంలో నిర్వహించిన ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఇంటర్ ప్రవేశాల కోసం జరిగిన అర్హత పరీక్షకు 434 మంది విద్యార్థులకు, 420 మంది విద్యార్థులు హాజరుకాగా, డిగ్రీ ప్రవేశ అర్హత పరీక్షకు 324 మందికి 312 మంది విద్యార్థులు హాజరైనట్లు టీఎస్ డబ్ల్యూ ఆర్ఎస్ డిగ్రీ కళాశాల నిర్వాహకులు తెలిపారు.

'బినామీల చేతుల్లో మున్సిపల్ దుకాణాలు'

మెదక్ మున్సిపాలిటీ: ఏళ్ల తరబడి బినామిల చేతుల్లో మగ్గుతున్న మున్సిపల్ దుకాణాల అక్రమాలకు తెరపడిందనుకునేలోగా స్టే రావడం అన్యాయమని ఎమ్మార్పీఎస్ నాయకులు బాల్‌రాజ్ అన్నారు. ఆదివారం బాల్‌రాజ్ మాట్లాడుతూ.. బినామీల చేతుల్లో మున్సిపల్ దుకాణాలు ఉండటం వల్ల అటు నిరుద్యోగులకు అన్యాయం కావడమే కాకుండా, మున్సిపల్ ఆదాయానికి గండిపడుతుందన్నారు. ఎన్నో ఏళ్లుగా పోరాటాలు చేయగా, ఇటీవల టెండర్లు వేసిన మున్సిపల్ అధికారులు బినామిలతో కుమ్మక్కై స్టే ఇప్పించారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన కనకరాజుకు సీఎంఆర్ఎఫ్ కింద రూ.60వేలు మంజూరు కాగా ఆదివారం సర్పంచ్ రాజు బాధితుడికి చెక్కు అందించారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, నరసింహ్మారెడ్డి, ఐలయ్య, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా అదే గ్రామానికి చెందిన గజం శ్రావణ్ గతేడాది క్రితం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ప్రభుత్వం నుంచి రూ.5లక్షలు మంజూరు కావడంతో బాధిత కుటుంబానికి చెక్కు అందించారు.

బడిలో మద్యం సీసాలు

- తాళాలు పగులగొట్టి మద్యం సేవిస్తున్న మందుబాబులు
- పోలీసులకు ఫిర్యాదు చేసినా.. ఫలితం శూన్యం
- ఇబ్బంది పడుతున్న చిన్నారులు



అల్లాదుర్గం బాలుర ప్రాథమిక పాఠశాల ఆవరణలో కట్టేసిన పశువులు

అల్లాదుర్గం(మెదక్): సరస్వతీ నిలయాలుగా కొలిచే పాఠశాల భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. రాత్రివేళ కొందరు పాఠశాల భవనాల తాళాలు పగులగొట్టి యథేచ్ఛగా మద్యం సేవిస్తూ అసాంఘిక కార్యకలాపాలు చేపడుతున్నారు. మద్యం మత్తులో పాఠశాల వరండాలో బండలు, తలుపు పగులగొడుతూ వీరంగం సృష్టిస్తున్నారు. మరోవైపు పాఠశాల ఆవరణలో ఉన్నవారు పశువులను తరగతి గదుల కిటికీలకు కట్టేస్తున్నారు. చూట్టు దుర్గంధంతో చిన్నారులు అవస్థలు పడుతున్నారు. ఈ పాఠశాల మన ఊరు–మన బడి కింద ఎంపికైన పనులు మాత్రం జరగడం లేదు. పోలీసులకు ఫిర్యాదు చేసినా.. ఫలితం లేదు. ఇదీ అల్లాదుర్గం బాలుర ప్రాథమిక పాఠశాల దుస్థితి.

- అల్లాదుర్గం ప్రాథమిక బాలుర పాఠశాలలో ఐదు తరగతులకు 76 మంది విద్యార్థులు, ఇద్దరు టీచర్‌లు ఉన్నారు. ఐదు తరగతి గదులు, వంట గది ఉంది. అయితే ఓ టీచర్ ఆన్ డ్యూటీలో పై చదువులకు వెళ్లి పోయింది. దీంతో ఒక్క ఉపాధ్యాయుడితోనే ఐదు తరగతులకు విద్యబోధన చేస్తున్నారు.
- ఈ పాఠశాల మన ఊరు – మన బడి కింద ఎంపికైంది. కేవలం విద్యుత్ పనులు చేపట్టి, అధికారులు చేతులు దులుపుకున్నారు. ప్రహరీ, ఇతర పనులు చేపట్టడం లేదు.
- కొందరు పోకీరిలు ఈ పాఠశాలలో నిత్యం మద్యం సేవిస్తూ.. బాటిళ్లు అక్కడే పడేస్తున్నారు. మద్యం తాగడంతో పాటు తరగతి గదుల తలుపులు, బండరాళ్లు పగులగొడుతున్నారు. గత డిసెంబర్‌లో ఇలాగే చేస్తే పాఠశాల హెచ్‌ఎం పోలీసులకు ఫిర్యాదు చేశారు. చర్యలు తీసుకుంటామన్న పోలీసులు ఏలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు చెబుతున్నారు.
- కొందరు ఆటోలో వచ్చి జెడ్పీ బాలుర పాఠశాల వద్ద ఆటో పెట్టి ప్రాథమిక పాఠశాలలో మద్యం సేవించారు. మరో గది తలుపులు పగులగొట్టి లోపలికి చొరబడి కరెంట్ తలుపులు వేసుకొని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లు హెచ్‌ఎం చెప్పారు.
- పాఠశాలలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై శుక్రవారం కాంప్లెక్స్ హెచ్‌ఎం, పాఠశాల హెచ్‌ఎం విఠల్ మరోసారి అల్లాదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరీ ఈ సారైన పోలీసులు చర్యలు తీసుకుంటారో చూడాల్సిందే.
- మరోవైపు పాఠశాల పక్కనే ఉన్న కొందరు తరగతి గదుల కిటికీలకు పశువులను కట్టేస్తున్నారు. ఇదే ప్రాంతంలో పశువులను కోసి మాంసం విక్రయాలు చేపడుతున్నారని స్థానికులు చెప్పారు. పశువులను కోయడంతో దుర్గంధమైన వాసన వస్తోంది. ప్రహరీ లేకపోవడంతో పాఠశాల ఆవరణలోనే మల విసర్జన చేస్తున్నారు. నిధులు మంజూరైన పనులు చేపట్టకపోవడంతో ఈ పరిస్థితి నేలకొంది. ఇప్పటికైన అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలి.



పాఠశాల గదిలో మద్యం బాటిళ్లు

మేమే గదులు శుభ్రం చేస్తున్నాం



పాఠశాలలో రాత్రి వేళ మద్యం తాగుతున్నారు. తాగిన మద్యం సీసాలు ఇక్కడే వేయడంతో మేమే బయట పడేసి శుభ్రం చేస్తున్నాం. తలుపులు పగులగొట్టారు. అయినా ఎవరు పట్టించుకోవడం లేదు.

– వివేక్, విద్యార్థి, అల్లాదుర్గం బాలుర ప్రాథమిక పాఠశాల

రెండుసార్లు ఫిర్యాదు చేశాం



పాఠశాలలో అసాంఘిక కార్యకలాపాలు చేపడుతున్నారు.మద్యం సేవించి వీరంగం చేస్తున్నారు.రెండు సార్లు పోలీసులకు ఫిర్యాదు చేసిన చర్యలు లేవు. పాఠశాలలో ఎప్పుడు ఎం చేస్తారో తెలియడం లేదు.

– విఠల్, హెచ్‌ఎం, అల్లాదుర్గం బాలుర ప్రాథమిక పాఠశాల

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలో ఆలయ నిర్మాణ పనులకు నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఆదివారం సాయంత్రం పరిశీలించారు. గ్రామంలో సొంత నిధులతో ఆంజనేయస్వామి ఆలయం, పోచమ్మదేవి ఆలయం, ఎల్లమ్మదేవి ఆలయ నిర్మాణ పనులు జరుగుతుండగా పరిశీలించారు. ఈనెల 8, 9, 10వ తేదీల్లో విగ్రహ ప్రతిష్ఠ జరగనుండగా పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట సొసైటీ వైస్‌చైర్మన్ చిన్నంరెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ దుర్గారెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు నవీన్‌గుప్తా, పైడి శ్రీధర్‌గుప్తా, గ్రామస్తులు ఉన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

నిజాంపేట(మెదక్): మండలంలోని బచ్చురాజ్‌పల్లి గ్రామంలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహాన్ని అంబేడ్కర్ నవ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్, విగ్రహ దాత గోపాల్‌రెడ్డి తండ్రి శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. ఓటు అనే ఒక ఆయుధంతో శాసించే, జీవించే హక్కును కల్పించిన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చల్మెడ సర్పంచ్ నర్సింహరెడ్డి, ధర్మారం సర్పంచ్ శివ ప్రతాప్‌రావు, వివిధ గ్రామాల ఎంపీటీసీలు సురేష్, రాజిరెడ్డి, చల్మెడ గ్రామ ఉపసర్పంచ్ తుమ్మల రమేశ్, వివిధ నాయకులు గర్గుల శ్రీనివాస్, తిరుపతి, సుదం మల్లేశం, జీపీ స్వామి, రాజు, మహంకాళి నరేష్, అక్షయ్, జాల పోచయ్య, సురేష్ నాయక్, లక్ష్మణ్, స్వామి, బాబు, సుధాకర్, దేవానందం, ప్రవీణ్, రాజశేఖర్, భాస్కర్, పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



నాయకులను సన్మానిస్తున్న నిర్వాహకులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని ధర్మాసాగర్‌లో ఆదివారం నరేశ్ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను గ్రామ యువకులు నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు వాకిటి శశిధర్‌రెడ్డి టోర్నమెంట్‌ను ప్రారంభించి నిర్వాహకులకు క్రికెట్‌కిట్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ప్రవీన్‌కుమార్, ఉపసర్పంచ్ జగన్, నాయకులు తిరుపతిరెడ్డి, సంతోష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. దీంతో పాటు నాగ్సాన్‌పల్లిలో యువకులకు సైతం క్రికెట్ కిట్ పంపిణీ చేశారు.

పేద కుటుంబాలకు బాసటగా కేసీఆర్ సర్కార్



చెక్కు అందిస్తున్న మదన్‌రెడ్డి, సునీతారెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): పేద కుటుంబాలకు కేసీఆర్ సర్కార్ బాసటగా నిలుస్తుందని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. ఆదివారం వెల్దుర్తిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న స్వచ్ఛభారత్



పాఠశాల ఆవరణను శుభ్రం చేస్తున్న యువకులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారం గ్రామంలో నేచర్ ఐకాన్‌యూత్ వారవారం స్వచ్ఛభారత్ చేపడుతున్నారు. ఆదివారం 255వ వారం స్వచ్ఛభారత్ చేపట్టి, ప్రాథమిక పాఠశాల వద్ద ప్లాస్టిక్, చెత్త చెదారాన్ని తొలగించారు. అనంతరం మొక్కల పాదులను శుభ్రం చేసి నీటిని పోశారు. గ్రామ యువకులకు చిన్నారులు సైతం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

కొల్చారం(నర్సాపూర్): 2006 – 2007 సంవత్సరానికి చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం కొల్చారం జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ద్వారా ఆదివారం వేదికగా ఒకటయ్యారు. 17 ఏళ్లుగా ఒక్కొక్కరు ఒక్కోస్థాయిలో స్థిరపడి విధులు నిర్వహించుకుంటున్నారు. పదో తరగతిలో చదువు చెప్పిన గురువులను గుర్తు చేస్తూ ప్రతి ఒక్కరూ ఏదో ఒక స్థాయిలో స్థిరపడి ఉన్నత స్థాయికి చేరుకోవాలని అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ సన్మానం



నర్సాపూర్‌రూరల్: మండలంలోని రెడ్డిపల్లి గ్రామ ఉప సర్పంచ్‌ను గ్రామస్తులు ఆదివారం ఘనంగా సన్మానించారు. గ్రామంలో నూతనంగా శ్రీ శివభక్త మార్కండేయ స్వామి ఆలయ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ అశోక్ గౌడ్ ఆలయ నిర్మాణానికి తనవంతు సాయంగా రూ.51,000 ల విలువైన ఇసుక తెప్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అశోక్‌గౌడ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఆంజనేయులు గౌడ్, భూమాగౌడ్, కిష్టాగౌడ్, వెంకటేష్, ఏర్ల శేఖర్, కట్ట యాదగిరి,చిన్నచింత కుంట పద్మశాలి గ్రామ కమిటీ అధ్యక్షుడు మునిగంటి రమేశ్ పాల్గొన్నారు.

◆ మోడల్‌స్కూల్ ప్రవేశపరీక్ష గడువు పెంపు

పెద్దశంకరంపేట(మెదక్): మోడల్ స్కూల్‌లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల కోసం ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 8 వరకు ప్రభుత్వం గడువు పొడిగించినట్లు పేట మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ విఠల్‌నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్‌లో 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

◆ విద్యార్థులకు ఇంటర్ కీలకం

నర్సాపూర్: విద్యార్థులకు ఇంటర్ ఎంతో కీలకమైన దశ అని ఎస్ఐ శివకుమార్ అభివర్ణించారు. ఆదివారం పట్టణంలో శ్రీవైష్ణవి జూనియర్ కాలేజీకి చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేయగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు తమ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, శ్రద్ధగా చదవాలని సూచించారు. కార్యక్రమంలో కాలేజీ చైర్మన్ టీపీసీసీ డెలిగెట్ ఆంజనేయులుగౌడ్, కాలేజీ కరస్పాండెంట్ పృథ్వీగౌడ్, ప్రిన్సిపాల్ రాజుగౌడ్, రెడ్డిపల్లి ఉపసర్పంచ్ అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

నల్లపోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



కౌడిపల్లి(నర్సాపూర్): నల్లపోచమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, సునీతారెడ్డి



శివ్వంపేట(నర్సాపూర్): కొలువైన లక్ష్మీనర్సింహస్వామి



నర్సాపూర్‌రూరల్: ఆలయంలో రుద్రాభిషేకం చేస్తున్న దృశ్యం



చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరీ ఆలయంలో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోమ్మదేవికి నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం మదన్‌రెడ్డి, సునీతారెడ్డి ఆలయానికి రావడంతో ఆలయ అధికారులు వెంకట్‌రెడ్డి, అర్చకుడు శివప్ప నాయకుల స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ఎమ్మెల్యే అమ్మవారికి విశేషపూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. బీఆర్ఎస్ నాయకులు పైడి శ్రీధర్‌గుప్తా, శివ్వంపేట ఎంపీపీ హరికృష్ణ, నర్సాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అనసూయ, కౌన్సిలర్ అశోక్‌గౌడ్, ఉపసర్పంచ్ మానిక్యరెడ్డి, మాజీ సర్పంచ్ సాయాగౌడ్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్‌రూరల్: మండలంలోని గొల్లపల్లి గ్రామంలో ఆదివారం నర్సాపూర్ అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ వాల్దాస్ రాధ మల్లేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో కేతకి భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంలో రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకుడు పరిశర్మ ప్రసాద్, రాజు, శ్రీశైలం, మల్లేశం , గ్రామస్తులు పాల్గొన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని చిట్కుల్ శివారులోని మంజీరా తీరంలో వెలసిన చాముండేశ్వరీ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం కావడంతో అమ్మవారి దర్శనానికి భక్తులు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు తీర్చుకున్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి జాతర కనుల పండువగా కొనసాగుతోంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పవిత్ర కొనేరులో స్నానం ఆచరించి దర్శించుకున్నారు. కొండపైన కొలువైన లక్ష్మీనర్సింహస్వామిని కాలినడకన వెళ్లి దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ శశిధర్, ప్రధాన అర్చకులు ధనుంజయ్‌శర్మ, సీనియర్ అసిస్టెంట్ నర్సింహరెడ్డి, అర్చకులు విద్యాకర్‌చారి తదితరులు ఉన్నారు.

అంజన్న సన్నిధిలో మరో ఆలయం

- దాత సహకారంతో సీతారామచంద్ర స్వామి ఆలయ నిర్మాణం
- ప్రతిష్ఠ మహోత్సవానికి ఏర్పాట్లు



సీతారామచంద్రస్వామి ఆలయం

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని చిన్నగొట్టిముక్ల గ్రామ పరిధిలోని అరణ్యంలో కొలువైన సహకార ఆంజనేయస్వామి ఆలయ సన్నిధానంలో మరో ఆలయం నిర్మాణం పూర్తయింది. మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్ వాస్తవ్యులు దశరథ్ రెడ్డి కోటి రూపాయలకు పైగా తన సొంత నిధులతో సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణం చేపట్టారు. తమిళనాడుకు చెందిన ప్రత్యేక శిల్ప కళాకారులతో వైవిధ్యభరితంగా వివిధ కళా నైపుణ్యత ఉట్టిపడేలా ఆలయ నిర్మాణ పనులు చేపట్టారు. స్వయంబుగా వెలసిన ఆంజనేయస్వామికి దాతల సహాయంతో గతంలో ఆలయాన్ని నిర్మించారు. మరో దాత కృషితో తామరపువ్వు ఆకారంలో సత్యనారాయణస్వామి ఆలయం నిర్మించారు. ఇందులో ఒకేసారి వంద మందికి పైగా దంపతులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు చేసుకునేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయంలో సత్యనారాయణస్వామితో పాటు వివిధ దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహించారు.

నేటి నుంచి అంకురార్పణ

నూతనంగా నిర్మించిన ఆలయంలో సోమవారం నుంచి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవానికి అంకురార్పణ జరగనుంది. వేద పండితుడు శాస్త్రుల వామనశర్మ ఆధ్వర్యంలో మంత్రజపంలో భాగంగా చిన్నగొట్టిముక్ల గ్రామం నుంచి ఆలయం వరకు ప్రతిష్ఠలో ఉంచే యంత్రాలకు శోభయాత్ర నిర్వహించనున్నారు. ఈ నెల 22 నుంచి 24 వరకు విగ్రహ ప్రతిష్ఠామహోత్సవం, 25 నుంచి 30 వరకు రామ తారకమంత్ర హోమంతో పాటు సీతారామచంద్ర కల్యాణోత్సవం జరగనుంది.

ముమ్మరంగా ఏర్పాట్లు

ప్రతిష్ఠ మహోత్సవానికి ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ తెలిపారు.

జీవిత లక్ష్యం నెరవేరింది



సీతారామస్వామి ఆలయ నిర్మాణంతో నా జీవిత లక్ష్యం నెరవేరింది. భార్య నాగమణి 4 ఏళ్ల క్రితం మృతి చెందింది. సంతానం లేకపోవడంతో రామానాయుడు వృద్ధాశ్రమంలో ఉంటూ తన సొంత ఆస్తులు అమ్మి ఆలయ నిర్మాణం పూర్తి చేశా. సమాజంలో ప్రతీ ఒక్కరు భక్తిమార్గంలో వెళ్లాలి. సంపదలో కొంత భాగాన్ని దైవకార్యాలకు ఉపయోగించాలి.

– దశరథ్‌రెడ్డి, ఆలయ నిర్మాణ దాత

కిరాణా దుకాణాలకు వేలం పాట



తునికి నల్లపోచమ్మదేవి ఆలయం వద్ద దుకాణాలు

కౌడిపల్లి(నర్సాపూర్): ఈ ఫొటోలో కనిపిస్తున్న డబ్బాకు నెలకు రూ. 32వేల అద్దె. ఇది ఎక్కడో కాదు. మారుమూల గ్రామంలో దుకాణానికి నెలకు రూ. 63వేలు. కౌడిపల్లి మండలంలోని తునికి నల్లపోచమ్మదేవి ఆలయం వద్ద కిరాణం సామగ్రి అమ్మేందుకు వేలం పాట నిర్వహించగా, పోటీదారులు ఇలా దుకాణాలను వేలంలో పాడుకున్నారు. ఒక దుకాణానికి నెలకు రూ. 50వేలు ఉంటుందేమో కానీ ఇక్కడ ఇది హాట్ టాపిక్. పూర్తి వివరాలు..

కౌడిపల్లి మండలంలోని తునికి నల్లపోచమ్మదేవి ఆలయం దేవాదాయ శాఖ ఆదీనంలో ఉంది. కాగా ఆలయం వద్ద నాలుగు దుకాణాలు ఉన్నాయి. ఇందులో ఒకటి అధికారులు ఆఫీస్‌రూంకు వినియోగించగా, మరో మూడు దుకాణాలతో పాటు డబ్బాను కిరాయి ఇచ్చేందుకు ఏడాదికి వేలంపాటను గత నెల 24న నిర్వహించారు. మొదటి దుకాణాన్ని గ్రామానికి చెందిన శ్రీకాంత్ రూ. 7,05,000కు రెండో దుకాణాన్ని మధుగౌడ్ రూ. 7,65,000కు మూడో దుకాణాన్ని శ్రీనివాస్ రూ. 6,05,000కు, ఇక డబ్బాను యాదాగౌడ్ రూ. 3,85,000కు వేలం పాటలో దక్కించుకున్నారు. ఇలా నాలుగు దుకాణాలను లక్షల్లో వేలంపాటలో దక్కించుకున్నారు. దీంతో ప్రతీ నెల రూ. 32వేల నుంచి రూ.63వేల వరకు అద్దె చెల్లించాల్సి ఉంది. ఒక్క రోజుకు సుమారుగా రూ. 2వేలు పైమాటే. ఇదే విషయమై ఈఓ మోహన్‌రెడ్డిని వివరణ కోరగా.. కిరాణా దుకాణం ఏర్పాటుకు మాత్రమే అనుమతిని ఇచ్చి వేలం వేశామని తెలిపారు.